## స్నేహాన్ని, అభిమానాల్ని, ప్రేమను దేనితో కొలుస్తారు? ఆర్థిక విలువలు మానవ సంబంధాల్ని పాడు చేస్తాయా?

నవలిక

# నీలి మేఘం

నందం రామారావు

## 6

టిక్కెట్ కూడా కొనలేదు. కానీ నాకా సమయంలో ఆ స్పృహే లేదు.

రైలు ముందుగు పరిగెడుతోంది. నేను ఖాళీగా వున్న సీటులో కూర్చున్నాను. కిటికీలో నుంచి చల్లని గాలి వీస్తోంది. ఆలోచనలతో అలసిన నేను నిద్రలోకి జారాను.

ప్రక్కనున్న వ్యక్తి తట్టి పిలుస్తుంటే మెలకువ వచ్చింది. "మీరు ఎక్కడికి వెళ్ళాలి?" ఆ వ్యక్తి అడిగాడు.

నాకు నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది. ఆ వ్యక్తివేపు చూశాను.

పైజమా, సిల్క్ లాల్చీ వేసుకున్నాడు. ఎర్రగా, లావుగా వున్నాడు. కారాకిల్లీ నములుతున్నాడు. అతని తెలుగు కూడా యాసగా వుంది.

"ఎక్కడికెడుతున్నారు?" అంటూ మళ్ళీ అడిగాడు.

"ఏమో తెలియదు" అన్నాను నిర్లిప్తంగా.

అతను ఆశ్చర్యంగా చూసి - "ఎవరూ లేరా?" అన్నాడు.

నా కళ్ళ ముందు తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, అమ్మా నాన్నా మెదిలారు. నా కందరూ వున్నారు. కానీ, ప్రస్తుతం నేను ఎవరికీ ఏమీ కాను!

నా మౌనం చూసి నా కెవ్వరూ లేరని నిర్ధారించుకున్నట్టున్నాడు. నా భుజం మీద చెయ్యి వేసి-

"ఏం విచారపడకోయ్. నాకూ ఎవరూ లేరు. ఇంతకీ ఏమన్నా చదువుకున్నావా?" అనడిగాడు.

"డిగ్రీ పాసయ్యాను" అన్నాను.

ఆ వ్యక్తి నవ్వి- "ఇంకేం నాకన్నా నువ్వే మెరుగు. నాకా చదువు కూడా లేదు. అయినా, నేను నీ లాంటి వాళ్ళను పది మందిని పోషించగలను" అన్నాడు.

నే నాయన వేపు వింతగా చూశాను.

పైకి సామాన్యుడిలా కనిపించే ఈయన పదిమందిని పోషించగలడా?

నా భావాన్ని గ్రహించినట్టుగా ఆయన నవ్వాడు.

"నువ్వు డిగ్రీ పాసయి ఎన్నాళ్ళయింది?"

"నాలుగేళ్ళు"

"ప్రస్తుతం ఏం చేస్తున్నావు?"

"ఏం చెయ్యడం లేదు"

"ఎందుకని?"

"ఎన్నో ప్రయత్నాలు చేశాను. ఏ వుద్యోగమూ రాలేదు."

ఇన్ని ప్రశ్నలు వేస్తున్నాడు. నాకేమన్నా అవకాశం కల్పిస్తాడేమోననే ఆశ కలిగింది.

క్షణం ఆగి-

"నాతో వస్తావా?" అన్నాడు నన్ను పరీక్షగా చూస్తూ.

ఆ క్షణాన నేనే పని చెయ్యడానికైనా సిద్ధంగానే వున్నాను. శశాంక, ప్రభాకర్, సుధ కలిగించిన అవమానం నా మనస్సులో మానని పుండులా బాధ పెడుతోంది.

ఆయన మాటకు నేను సరే అన్నాను.

ఆయన నవ్వి నా భుజం మీద చెయ్యి వేసి చిన్నగా తట్టాడు. ఆ తర్వాత మేమిద్దరం కలిసి భోజనం చేశాం. ఎన్నో రోజుల తర్వాత లభించిన ఆ కమ్మటి భోజనం నా కడుపులోని మంటను తగ్గించింది.

ఆయన తను చూసిన ప్రదేశాల గురించి చెబుతున్నారు. నేను వింటూ కూర్చున్నాను.

సాయంత్రం నాలుగ్గంటలకు మా రైలు ఢిల్లీ చేరింది. ఆయన లేచి - "రా, వెడదాం" అన్నాడు.

ఇద్దరం కంపార్ట్‌మెంటు దిగాం. వెంటనే నలుగురు వ్యక్తులు వచ్చి ఆయన చుట్టూ చేరారు.

"సార్! మీరిక్కడ వున్నారా? ఫస్ట్ క్లాస్‌లో చూశాం!"

"అనుకోకుండా బయలు దేరడంతో ఫస్ట్ క్లాస్‌లో రిజర్వేషన్ దొరకలేదు. ఐనా, ఇదీ ఒకందుకు మంచిదేలే. చాకులాటి కుర్రాడు దొరికాడు" అన్నాడు నా భుజం మీద చెయ్యి వేసి.

వాళ్ళు నా వేపు చూశారు. ఆయన నన్నలా పొగడ్డం నాకు ఆనందాన్ని కలిగించింది. ఇన్నాళ్ళూ తిట్లూ శాపనార్థాలూ తప్ప పొగడ్తలు ఎరుగను. అదీగాక, ఆయనకి తొలి పరిచయంలోనే నా మీద అంత మంచి నమ్మకం కలిగినందుకు ఆశ్చర్యం కూడా కలిగింది.

"రండి సార్"

బయటకెళ్ళి అందరం కార్లో కూర్చున్నాం. కారు మెత్తని రోడ్డు మీద మెల్లగా సాగిపోతోంది. నేను వూరుని వింతగా చూడసాగాను. అరగంట తర్వాత కారు ఒక పెద్ద బంగళా ముందు ఆగింది.

అందరం లోపలకెళ్ళాం. ఆయన నన్ను మేడ మీద ఒక గదిలోకి తీసుకెళ్ళి- "ఇది నీ గది. ఆ ప్రక్కనే బాత్ రూమ్ వుంది. ఆ బీరువాలో బట్టలున్నాయి మళ్ళీ అరగంటలో వస్తాను" అని వెళ్ళిపోయాడు.

ఆ గదిని చూసి నాకు నోట మాట రాలేదు. అంత అందమైన గదుల్ని సినిమాల్లో మాత్రమే చూశాను. తలుపు వేసి బాత్‌రూమ్‌లోకి అడుగు పెట్టాను. గంట సేపు స్నానం చేశాను.

ఇన్నాళ్ళ బడలిక తీరినట్లనిపించింది. బీరువా తెరచి చూశాను. రకరకాల సూట్లు అన్నీ నాకు సరిగ్గా సరిపోయాయి. ఎంతో ఆశ్చర్యం. ఆలివ్ గ్రీన్ సూట్ వేసుకుని, తల దువ్వుకుంటుండగా తలుపు మీద చిన్నగా చప్పుడు వినిపించింది. వెళ్ళి తలుపు తీశాను.

ఆయనే! నా వేపు పరీక్షగా చూశాడు. నా భుజం మీద చెయ్యి వేసి - "సినిమా హీరోలా వున్నావు. అవునూ! నీ పేరేమిటి?" అనడిగాడు.

నేను చెప్పాను.

"నా పేరు దినకర్" అన్నాడు.

"సార్."

వెనుక నుంచి ఎవరో పిలవడంతో దినకర్ వెనక్కి తిరిగాడు. బట్లర్ ట్రేతో నిలబడ్డాడు.

## నీలిమేఘం

''టేబుల్ మీద పెట్టు'' అన్నాడు.

బట్లర్ టేబుల్ మీద పెట్టాడు.

''రా టిఫెన్ చేద్దాం''

మేమిద్దరం కూర్చీల్లో కూర్చున్నాం. బట్లర్ ట్రేలోంచి ప్లేట్లు తీసి టేబుల్ మీద అమరుస్తున్నాడు. వాటిల్లో రకరకాల ఫలహారాలు. వాటి పేర్లేమిటో కూడా నాకు తెలియదు.

''తిను కిరీటి''

కొన్ని ప్లేట్లు నా ముందుకి తోశాడు.

నేను తిన్నాను. అంత రుచికరమైన ఫలహారాలు నా జీవితంలో తినడం అదే ప్రథమం. క్షణాల్లో ప్లేట్లన్నీ ఖాళీ చేశాను.

''నేను రేపు మళ్ళా వూరెళ్ళాలి. మళ్ళీ వారంలో తిరిగొస్తాను. అప్పటి వరకూ ఈ గదిలోనే వుండు. ఏం కావాలన్నా ఆ బెల్ నొక్కు. నౌకర్లు నీకు ఏం కావాలన్నా తెచ్చిస్తారు''

''నాకిదంతా అద్భుతంగా వుంది. ఇంటల్లుడికంటే ఎక్కువ మర్యాదలు. ఎవరితను? నాకెందుకింత గౌరవ మర్యాదలిస్తున్నాడు. ఈ మర్యదలూ, ఈ ఆతిథ్యమూ కాకుండా నాకేదైనా వుద్యోగ మిప్పిస్తే ఎంత బాగుంటుందో కదా.

అదే దినకర్‌తో అన్నాను.

దానికాయన బిగ్గరగా నవ్వి- ''తొందరెందుకు. ఒక్కసారి పనిలోకి ప్రవేశించావంటే ఇక క్షణం కూడా నీకు విశ్రాంతి వుండదు. అందుకే ఇప్పుడు హాయిగా విశ్రాంతి తీసుకో . వూరంతా చూడు. నేను రాగానే నీకు వుద్యోగం ఇస్తాను'' అన్నాడు.

నేను సరేనని తలూపాను. ఆ వారం రోజులూ నాకు స్వర్గంలో వున్నట్టుగా వుంది. తినడం, తిరగడం ఇదే నా పని. జీవితంలో అంత ఆనందం, సుఖం వుంటాయని నాకప్పుడే తెలిసింది.

వారం తర్వాత దినకర్ వచ్చి - ''ఎలా వున్నావు కిరీటీ'' అంటూ పలుకరించాడు.


''స్వర్గలోకంలోని దేవేంద్రుడిలా వున్నాను'' అన్నాను నవ్వుతూ.

దినకర్ నా వేపు పరీక్షగా చూస్తూ- ''నువ్వు చాలా మారిపోయావు'' అన్నాడు.

''అంటే?''

''ఇప్పుడు సిసలైన రాజకుమారుడిలా వున్నావ్'' అన్నాడు నవ్వుతూ.

నేను సిగ్గు పడ్డాను.




''కిరీటీ! నేను వెళ్ళిన పని పూర్తయింది. నువ్వు వుద్యోగం కావాలన్నావు కదూ. ఈ రాత్రికే నీకు పని చూపిస్తాను''

రాత్రికి పని చూపించడమేమిటి? నాకు అనుమానం కలిగినా ప్రశ్నించలేదు.

''రాత్రి పది గంటలకు వస్తాను నిద్రపోకు'' అని వెళ్ళిపోయాడు.

ఎనిమిది గంటలకు భోజనం చేశాను. మేగ్జయిన్లు తిరగేస్తూ కూర్చున్నాను. దినకర్ చెప్పినట్లు సరిగ్గా పది గంటలకు వచ్చాడు.

''రెడీనా?''

''ఆ''

''సరే రా'' అన్నాడు.

నేను, దినకర్‌తో క్రిందికి వచ్చాను. కారు దగ్గర ముగ్గురు మనుషులు కనిపించారు.

''లాల్‌జీ అంతా సరిగ్గా వుందా?''

''యస్ సార్''

అందరం కార్లో కూర్చున్నాం. కారు వూరు దాటింది. అమావాస్య చీకటి. అక్కడక్కడున్న లైట్లు గుడ్డిగా వెలుగుతున్నాయి. సరాసరి రైల్వే లైను దగ్గర కొచ్చాం. అక్కడ గూడ్స్ రైలు వుంది. కారు ఆగింది.

''వెళ్ళి ఆ తాళం బద్దలు కొట్టండి. దాన్లో లక్షలు ఖరీదు చేసే వెహికల్ స్పేర్ పార్ట్స్ వున్నాయి. వాటిని క్రిందికి దింపండి. కాసేపట్లో వ్యాన్ వస్తుంది. దాన్లో చేర్చండి'' అన్నాడు దినకర్.

''అందరూ దిగారు!

నాకు నోట మాట రాలేదు.

ఏమిటిది? ప్రభుత్వం సొమ్ము దొంగతనం చెయ్యడమా? ఎవరైనా చూస్తే ఎంత ప్రమాదం.

నేను నిలబడి వుండడం చూసి-

''నువ్వూ వెళ్ళు కిరీటీ'' అన్నాడు దినకర్.

ఎప్పటిలా మృదువుగా లేదు ఆ కంఠం. ఏదో అధికారం, ఆజ్ఞా కనిపించాయి. ఆయన మాటను కాదనలేక, నేను మౌనంగా వాళ్ళని అనుసరించాను.

రెండు గంటల్లో పని పూర్తయింది. నేను భయపడినట్టు ఎవరూ అక్కడికి రాలేదు! మరో అరగంటలో అందరం తిరిగొచ్చాం. కానీ! నాకు ఇంకా అదురుగానే వుంది. ఏ క్షణాన పోలీసులు వస్తారోనని.

మూడు రోజులు గడిచాయి. ఎవ్వరూ రాలేదు. ఎవరైనా వచ్చినా కూడా మమ్మల్నేం చెయ్యలేరని నాకప్పుడు తెలీలేదు. నాలుగోరోజు రాత్రి మేం బొంబాయి వెళ్ళాం. షిప్‌లో నుండి వస్తున్న స్మగుల్డ్ వస్తువులు చేరవేయడానికి.

నాకు అప్పటికి తెలిసింది దినకర్ చేసే బిజినెస్ ఏవిటో!

''దినకర్, అతని ముఠా అందరూ దొంగలూ, స్మగ్లర్లు. ఇక్కడ వుంటే నేనూ ఒక దొంగనే అవుతాను. నాకెందుకో భయం వేసింది.


ఆ మర్నాడు దినకర్‌ని అడిగాను.

''మీరు స్మగ్లర్లు కదూ?''

''దినకర్ నవ్వాడు. నవ్వి- ''అంతేకాదు. దొంగలం కూడా'' అన్నాడు.

నేను మాట్లాడ లేకపోయాను.

''చూడు కిరీటీ! ఈ దేశంలో దొంగలు కాని వారెవరో చెప్పగలవా? ఈ ప్రపంచంలో ఎవడే పని చేసినా డబ్బు సంపాదించడానికే. ఇక దొంగతనమంటావా? ప్రతి వాడూ ఏదో ఒక విధంగా దొంగే! నిజాయితీ పరుడు ఒక్కడూ కనిపించడు. ఐతే, మనం ఎవరినీ నమ్మించి మోసం చెయ్యడం లేదు. ఎవడి కొంపా కూల్చడం లేదు. దొంగ రవాణా అవుతున్న వస్తువుల్ని మనం కాజేస్తున్నాం. పెద్ద పెద్ద వాళ్ళు తమకున్న డబ్బుతో ఏం చెయ్యాలో తోచక బాధపడుతుంటే మనం దాన్ని తీసుకుని వాళ్ళ బాధని తొలగిస్తున్నాం. విదేశాల నుంచి వస్తువులు తెచ్చి తక్కువ ధరకు అమ్ముతున్నాం. ఇవన్నీ అన్యాయాలూ, అక్రమాలూ అంటావా? కానీ, మనకంటే గొప్ప వాళ్ళు , కనపడని దొంగలు ఈ దేశంలో చాలా మంది వున్నారు. కిరీటీ! చదువుకున్న వాడివి. నీకు ఈ లోకం గురించి ఈ పాటికి బాగానే తెలిసి వుంటుంది. పట్టుబడితే దొంగలు. లేక పోతే దొరలు. మనం



ఎప్పటికీ పట్టుబడం. అంటే మనం దొరలమే. కిరీటీ! ఆలోచించు. నీ కిష్టమైతేనే ఇక్కడ వుండు. లేక పోతే వెళ్ళు. ఏం బలవంతం లేదు''

నేను తలాంచుకుని ఆలోచిస్తున్నాను.

దినకర్ నా భుజం తట్టుతూ - ''కిరీటీ! నీ లాంటి వాడు ఆ ప్రపంచంలో బతక లేడు. హాయిగా నా దగ్గర వుండు. లక్షలు సంపాదించు. వున్నన్నాళ్ళూ హాయిగా, ఆనందంగా బతుకు. తొందర లేదు. నిదానంగా ఆలోచించు'' అని వెళ్ళిపోయాడు.


నేను ఆలోచించాను: ఎంత ఆలోచించినా దినకర్ చెప్పిన విషయాలే బాగా వున్నట్లనిపిస్తోంది. చివరకు దినకర్‌తోనే వుండిపోవాలనే నిర్ణయానికొచ్చాను. ఆ నాటి నుంచీ నేను కూడా దినకర్ ముఠాలో ఒకడినై పోయాను.

దొంగతనాలూ, దోపిడీలూ ఇదే జీవితమై పోయింది. లక్షలు సంపాదించాను. జీవితంలోని అందాన్నీ, ఆనందాన్నీ అనుభవించాను.

నేను ఈ వృత్తిలోకి దిగిన రెండు నెలలకు నాన్నకి వుత్తరం రాశాను. నాకు బొంబేలో పెద్ద వుద్యోగం దొరికిందని. నెలా నెలా డబ్బు పంపిస్తానని రాశాను. ఆ తర్వాత ప్రతి నెలా డబ్బు పంపించసాగాను. దీనితో మా వాళ్ళ కష్టాలు తీరాయి. తమ్ముళ్ళ, చెల్లెళ్ళ జీవితాలు బాగు పడ్డాయి. ఈ పదేళ్ళల్లో రెండు మూడు సార్లు మాత్రమే మా వూరు వెళ్ళాను.

నన్నూ, నా కారునీ, డబ్బునీ చూసి ఇంట్లో ఎంతో ఆనందించారు. నేనేదో పెద్ద ఆఫీసరు వుద్యోగం చేస్తున్నానని భ్రమించారందరూ. నా జీవితాన్ని గురించిన చేదు నిజాన్ని చెప్పి వాళ్ళ గుండెలు బ్రద్దలు చెయ్యడం ఇష్టం లేక అసలు నిజాన్ని నాలోనే దాచుకున్నాను.

రోజులు గడిచి పోతున్నాయి. వారం క్రితం ఒక పెద్ద బ్యాంక్‌ని దోపిడీ చేసి



## నీలిమేఘం

యాభై లక్షలు సంపాదించాం. ఇది దేశంలో చాలా సంచలనం కలిగించింది. పోలీసులు మా కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. దినకర్ తప్పించుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు. కానీ నాకెందుకో ఈసారి తప్పకుండా పట్టుబడతామనిపిస్తోంది. మొదట మాకు హామీ యిచ్చిన పెద్దలు ముఖం చాటేస్తున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి.

మేం గనుక పట్టుబడితే పెద్ద శిక్ష పడుతుంది. అది ఖాయం. ఈ శిక్షపడే ముందు ఏదో ఒక పని చెయ్యాలనిపించింది. వెంటనే నాకు హైద్రాబాద్‌లోని నా స్నేహితులు జ్ఞాపకం వచ్చారు. దాంతో పాటు వాళ్ళు నాకు చేసిన ద్రోహం కూడా మరోసారి జ్ఞాపకం వచ్చింది.

నేను దరిద్రుడినని ఆ నాడు నన్ను నిరసించారు. ఇప్పుడు నేను లక్షాధికారినని తెలిస్తే వాళ్ళ భావాలెలా వుంటాయి. ఆ విషయం తెలుసుకోవాలనిపించింది.

అంతే. వెంటనే బయలుదేరి హైద్రాబాద్ వచ్చాను.

నా స్నేహితులు...నాకు... కాదు...నా డబ్బుకి బ్రహ్మరథం పట్టారు.

వాళ్ళనీ, వాళ్ళ స్వార్థాన్నీ, ధనం మీద వాళ్ళకున్న వ్యామోహాన్ని చూసిన నాకు అసహ్యమేసింది. వాళ్ళకి ఎదురు దెబ్బ కొట్టాలనిపించింది. బిజినెస్ పేరు మీద వాళ్ళ దగ్గర నుంచి డబ్బు దోచాను. నేను బ్యాంక్‌లో దోపిడీ చేసిన డబ్బు నుంచి చెరి అయిదు లక్షలు వారిద్దరికీ ఇచ్చాను. శశాంక గానీ, ప్రభాకర్ గానీ ఆ డబ్బుని మార్చాలని ప్రయత్నిస్తే వాళ్ళకి సంకెళ్ళు తప్పవు. ఎందుకంటే ఆ నోట్ల నెంబర్లు దేశంలోని అన్ని బ్యాంకులకూ చేరాయి.

అయినా నా మనస్సు ఇంకా శాంతించలేదు. వాళ్ళని ఇంకా, ఇంకా హింసించాలని వుంది. కానీ, సమయం లేదు. నా కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ మధ్య నా ఫోటో పేపర్లో వచ్చింది. అది చూసినా నువ్వంత త్వరగా గుర్తించ లేవు. ఎందుకంటే ఆ ఫోటోలో నాకు చిన్నగడ్డం, కళ్ళకు జోడు, పెద్ద మీసాలూ వుంటాయి. అదీగాక నా హెయిర్ కటింగ్ కూడా వేరుగా వుంటుంది. కానీ పోలీసులు నేనెలా వున్నా గుర్తు పట్టగలరు.

ఈ రోజు... కాక పోతే రేపు... లేక పోతే మరో రోజైనా నేను పట్టుపడక తప్పదు. నాకు శిక్ష పడకా తప్పదు! అన్యాయానికీ, అధర్మానికీ తెరపడక తప్పదు.

శేఖర్! తెలిసే ఎందుకీ మార్గానికొచ్చావని నువ్వు నన్నడగొచ్చు. ప్రతి మనిషికీ



## పాపులేషన్ ఎక్స్‌ప్లోజన్

జనం... జనం... ప్రభంజనం
ఇది నిజం... నిజం... రాసుకోండి అమృతాంజనం
ఇరవయి ఒకటో శతాబ్దికి... చీమల్లా... దోమల్లా
గ్లోబంతా జనం... జనం... జనం
ఈ సారే జహా అచ్చా మొత్తం యావత్తూ
ఉచ్చాల మయం... పుచ్చె లెగిరిపోతాయని
భయం... భయం... భయం... భయం
ఏ రిక్రియేషన్ లేని
ఈ దేశంలో... నా దేశంలో
"క్రియేషనే
రిక్రియేషన్" సిరిసిరిమువ్వా

మన వాళ్ళున్నారు చూసారూ
నిరోధ్‌కి విరోధులు సారూ
ఇది ప్రబద్దలయిన జనం బాంబు
విశ్వదాభిరామ... వినుర వేమా!

—రాధామనోహరన్



## నీలిమేఘం

ఇది తప్పు. ఇది ఒప్పు అని తెలుసు. తెలిసినా తప్పు చేస్తూనే వున్నాడు. ఎందుకో తెలుసా? పరిస్థితుల ప్రాబల్యం వలన!

ఆనాడు, పది సంవత్సరాల క్రితం శశాంక, ప్రభాకర్, సుధ ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు నన్నాదుకున్నా, ఆ వచ్చే కొద్ది పాటి జీతంలోనే ఎంతో నిజాయితీగా బతికే వాడిని. కానీ,! వాళ్ళకు అవకాశం వున్నా నాకు వుద్యోగం ఇవ్వలేదు! ఇవ్వకపోగా స్నేహాన్ని మరచి నన్ను ఎద్దేవా చేశారు.

శేఖర్! మనిషికి డబ్బే ముఖ్యం కాదు. జీవితంలో అంతకు మించిన విలువలు చాలా వున్నాయి. ఆ విలువల్ని కాలదన్నిన రోజున మనిషి పతనం కావడం తథ్యం. నాగరికత పేరుతోనూ, డబ్బు పై వ్యామోహంతోనూ మనిషి ఎంతగా పతనం అవుతున్నాడో నేను స్వయంగా చూశాను!

ఈ డబ్బు కోసం కట్టుకున్న భార్యనీ, కన్నకూతుర్ని తాకట్టు పెట్టడాని క్కూడా వెనుదీయలేదు వాళ్ళు. ఇదిరా శేఖర్ డబ్బు చేసే గారడీ. ఈ గారడీలో శశాంక, ప్రభాకర్, మాలతి, సుధ ఆటబొమ్మలు. వీళ్ళనీ, వీళ్ళ స్వభావాల్నీ గూర్చి నీ రచనల్లో చిత్రిస్తే నీ రచనలు శాశ్వతంగా వుండిపోతాయిరా.

శేఖర్! నేను డబ్బు సంపాదించాను. లక్షలు సంపాదించాను. ఎందుకో తెలుసా? డబ్బు మీది వ్యామోహంతో కాదు. నాకు జరిగిన అవమానానికి ప్రతీకారం చెయ్యాలని, నాకు కలిగిన పరాభవానికి తగిన శాస్తి చేసి వాళ్ళనెలాగైనా అవమానించాలని, నవ్వులపాలు చెయ్యాలని. అదే నా ధ్యేయం.


ఆ ధ్యేయం కోసమే ఇది అన్యాయమార్గమని తెలిసినా ఆ మార్గంలో నడవక తప్పలేదు! చివరకు నా కోర్కె నెరవేర్చుకున్నాను.

శేఖర్! నేను హైదరాబాద్ రావడం ఒక విధంగా నాకు చాలా లాభించింది. నీ స్నేహమాధుర్యాన్ని, రేఖ అందించిన ప్రేమామృతాన్ని చవిచూడ గలిగాను.

శేఖర్! రేఖ ఎవరో నీకు తెలిసే వుంటుంది. శశాంక చెల్లెలు రేఖ. రేఖ చివరి రోజు రాత్రి నా దగ్గరకొచ్చింది. దివిలోని దేవతలా, భువిలోని పారిజాతంలా మెరిసిపోయింది. మెల్లగా నన్ను సమీపించి నా చేతిని పట్టుకుని–

"అంకుల్! రేపు మీరు వెళ్ళిపోతున్నారు కదా. మళ్ళా మీరు వస్తారో లేదో నాకు తెలీదు. కానీ నా మనసులోని ఈ విషయాన్ని మీకు చెప్పకుండా వుండలేకపోతున్నాను. అంకుల్! జలధరాన్ని చూసి వన మయూరి నర్తిస్తుందని, చంద్ర కాంతిని చూసి కలువ వికసిస్తుందని, అది తొలి వలపుకి చిహ్నమని పుస్తకాల్లో చదివాను. నాకు అదంతా అబద్ధమనిపించేది. కానీ అంకుల్! మిమ్మల్ని చూడగానే నాకు తెలీకుండానే నా మనస్సు స్పందించింది. నా హృదయం నర్తించింది. ఇదేనేమో ప్రేమంటే. నా మనసు, నా శరీరం మీ సన్నిధిలో సదా వుండాలని కోరుకుంటున్నాయి. నా కెందుకిలా వుందో నాకే తెలీదు" అంది.

రేఖ కళ్ళల్లో నీళ్ళు!



## శ్రేష్ఠమైనవాటినే కొనేవారు ఏరికోరి కొనేవి రాగి అడుగుతోగూడిన కాళీ కాపర్ బాటమ్ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు.




**ఎందుకంటే కాళీ ఒక్కటే సాటిలేని అనేక అనుకూలతలు సమకూర్చేది**

కాళీ మార్కు 35 సంవత్సరాలకు పైగా స్టెయిన్‌లెస్ స్టీల్ వంట పాత్రల విశిష్టతకు ప్రసిద్ధికెక్కినది; అంతేకాదు, ఈనాడు, రాగి అడుగు గల వంట పాత్రలకు నం. 1 పేరు.

కాళీ కాపర్‌బాటమ్ వంట పాత్రలలో ప్రత్యేక ప్రయోజనాలు.

* **త్వరితమైన వంట:**
  వంటకు పట్టే సమయం 50% తగ్గుతుంది. కారణం, రాగి అన్ని లోహాలకంటే అత్యధిక ఉష్ణవాహక లోహం. (వెండికి మాత్రమే రెండవది.)
* **తక్కువ ఇంధన వినియోగం:**
  తక్కువ మంటతోనే వంటంతా చెయ్యవచ్చు. సర్వత్ర సమానంగా వ్యాపించే వేడివల్ల మంట మచ్చలుగాని, వంటకాలు మాడిపోవడంగాని జరుగదు.
* **మన్నికగల విలువ:**
  గుణగణాల దృష్ట్యా, స్టెయిన్‌లెస్ స్టీలు, రాగి, అణువుతో అణువుగా పరస్పర బంధితం కావడంవల్ల, ఆ రెండిటి మధ్యా విడదీయరాని బంధనం ఏర్పడుతోంది. అంతేగాక, రాగి బంధనం పాత్రయొక్క అట్టడుగు గోడలదాకా వ్యాపించి వుండడంవల్ల మంట, దాని వేడి, రెండూ వంటకు పూర్తిగా ఉపయోగపడుతుందనే హామీ లభిస్తోంది.

గృహిణుల విశ్రాంతికి ఎక్కువకాలం లభిస్తుంది. ఉద్యోగాలు చేసే స్త్రీలకు వంట త్వరగా పూర్తవుతుంది. ప్రతి ఒక్కరికీ–తక్కువ ఇంధనం ఖర్చు, బాగా వండిన వంటకాలు, దీర్ఘకాలపు విలువ.

నకిలీల విషయంలో జాగ్రత్త! కాళీ ట్రేడ్‌మార్కు వుందా లేదా చూడండి.

విక్రయ ఏజెంటు:
శ్రీ విద్యా ఏజెన్సీస్, కుంబేశ్వరర్ సన్నధి, కుంబకోణం 612 001
ప్రాంతీయ ఏజంట్లు:
నమ్ము అండ్ కో, పోస్ట్‌బాక్స్ నం. 3622, ఎమ్‌జి రోడ్, ఎర్నాకుళం, కొచ్చిన్ 682011, ఫోన్: 361139
ఈస్ట్ ఇండియా కంపెని, 3, అమృత బెనర్జీ రోడ్, (కాళీఘాట్ పోస్టాఫీస్ ఎదుట) కలకత్తా 700 026, ఫోన్: 471840
విక్టరీ మెటల్స్, 101, ఖేట్వాడీ మెయిన్ రోడ్, బొంబే 400 004 ఫోన్: 380075/354507
జె.సి. మాన్‌చందా. 15 ఎ/38, కరోల్‌బాగ్, న్యూ ఢిల్లీ 110 005, ఫోన్: 562019

GK&E.MBE.71 Tg.


## నీలిమేఘం

అది చూసి నేను చలించి పోయాను.

రేఖ చెంపల మీదికి జారిన కన్నీళ్ళు తుడుచుకుని–

"అంకుల్! నన్ను ఆదరిస్తారో, నిరాకరిస్తారో ఇక మీ యిష్టం. నా జీవితాన్ని మీ పాదాల ముందు వుంచుతున్నాను. అంకుల్! ఆలోచించండి. ఇప్పుడే చెప్పనక్కర్లేదు. కానీ ఒక్క విషయం. మీ రనేక పనుల్లో మునిగి తేలుతూ వుంటారు. ఇక్కడ 'రేఖ' అనే ఒక జీవచ్ఛవం మీ కోసం, మీ పిలుపు కోసం ఎదురు చూస్తూ వుంటుందన్న విషయం మాత్రం గుర్తుంచుకోండి. ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్ళయినా మీ కోసం వేచి వుంటాను" అంటూ తన సుకుమారమైన రెండు చేతుల్ని నా మెడ చుట్టూ పెనవేసి నా చెక్కిలిపై ముద్దుపెట్టుకుంది. నా భుజం మీద తల వాల్చి–

"ప్రియతమా! ఈ పెదవుల తడి ఆరక ముందే, నా జడలోని మల్లెలు వాడక ముందే నన్ను తీసుకెళ్ళు. కళ్ళనే వాకిళ్ళు చేసి, ఎద తలుపులు తెరచి నీ కోసం ఎదురు చూస్తూ వుంటుంది ఈ అభిసారిక. ప్రియా! ఎదురు చూసి చూసి అలసిపోనీకు నన్ను. ఈ శరీరంలో ప్రాణం పోక ముందే వస్తావు కదూ!" మరోసారి చెక్కిలిపై ముద్దు పెట్టుకుని వెళ్ళి పోయింది రేఖ.

శేఖర్! ఆ మధురానుభూతి నుంచి తేరుకునే సరికి నాకు గంట పట్టింది. ఇది కలా? నిజమా? అనే భ్రాంతి కలిగింది. కానీ, నా చెక్కిలిపై ఆమె పెదవుల తడి ఇది నిజమని చెప్పింది.

శేఖర్! నా జన్మ ధన్యమై పోయింది. రేఖలాటి స్త్రీ ప్రేమను పొందగలిగాను. నా కంతే చాలు.

రేఖ మాటలు నాలో అమృత వర్షాన్ని కురిపించాయి. నా హృదయ వీణను శ్రుతి చేసి మధుర రాగాలు పలికించింది. రేఖ... ఎంత అందమైన పేరు. పేరుకు తగ్గ రూపం. రూపానికి తగ్గ గుణం.

శేఖర్! రేఖ ప్రేమను పొందిన నేను చాలా అదృష్టవంతుడిని, కానీ! ఆ అదృష్టాన్ని శాశ్వతం చేసుకోలేని నిర్భాగ్యుడిని. రేఖతో క్రొత్త జీవితాన్ని ప్రారంభించాలని వుంది. రేఖ ఒడిలో పడుకుని కమ్మగా నిద్రపోవాలని వుంది. ఆమెతో కలిసి ఆనంద తీరాల్ని, అందాల అంచుల్ని చేరాలి. ఏ జంటా పొందని అమర సుఖాల్ని చవి చూడాలి. కానీ, నా కంత అదృష్టం లేదు.

రేఖను దూరం చేసుకోను. ఆమె నా స్వంతం కావాలి. ఎలా? భగవంతుడా! ఇంతవరకు నిన్నేం కోరలేదు. నా రేఖను నాకు దక్కించు. నాకు శిక్షపడకుండా చెయ్యి. నా జీవిత సంధ్యాకాలంలో ఈ దేవత సాక్షాత్కరించింది. కోరకుండానే వరాలిచ్చింది. కష్టాలతో, బాధలతో ఎండిపోయిన ఈ బ్రతుకు ఎడారిలో వెన్నెల జల్లులు కురిపించింది. స్వామీ! ఈ కల నిజం చెయ్యి. ఈ క్షణాలు శాశ్వతం చెయ్యి.

శేఖర్! దేవుడు నా మొరాలకిస్తాడంటావా? నన్ను పోలీసులు పట్టుకోకుండా వుంటే ఎంత బాగుణ్ణు. పట్టుకున్నా శిక్ష పడకుండా వున్నా, కొద్ది శిక్షతో తప్పిపోయినా ఫర్లేదు. నే నెప్పుడొచ్చినా నా రేఖ నన్ను ఆదరిస్తుంది.

కానీ, ఏమవుతుందో కదా!

శేఖర్! ఒక వేళ నేను తిరిగి రాలేక పోయినా...

నీ స్నేహాన్ని

రేఖ ప్రేమనీ

తలచుకుంటూ జైలు జీవితాన్ని గడుపుతాను.

మరో జన్మ వుంటే నీలాంటి స్నేహితుడినీ, రేఖలాంటి భార్యనీ ప్రసాదించమని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నాను.

ఈ కోరికైనా తీరుతుందంటావా?

శేఖర్! ఈ దైవోపహతుడు, దురదృష్టవంతుడు ఎప్పుడైనా జ్ఞాపకం వస్తే. రెండు కన్నీటి బొట్లు విడువు. అది చాలురా, ఈ బీదవాడికి!

గుడ్‌బై చేస్తూ...

నీ

కిరీటి.

(సమాప్తం)